బీజేపీలో చేరికలు



బీఆర్ఎస్ నాయకులకు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు

మోతీనగర్: బీఆర్ఎస్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు తేడా ఏమి లేదని దొందూ దొందేనని బీజేపీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు పేర్కొన్నారు. ఆదివారం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో శ్రీవివేకానందనగర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు రమేష్, గణేష్, రవితో పాటు మరికొంతమంది నాయకులు బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి పులిగొల్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీ పార్టీలో చేరారు. వీరికి మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి మోదీకి కానుకగా అందజేయాలని తెలిపారు.

హస్తం గూటికి నేతలు

ఆల్విన్‌కాలనీ: కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పలువురు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి కాంగెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో షౌకత్ ఆలీ మున్నా, యాదగిరి, పోశెట్టి గౌడ్, మోజెస్, మహేష్, జనార్దన్, రవీందర్, విజయమ్మ, బాలస్వామి సాగర్, రాజు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగెస్ పార్టీ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, రాజు, పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో జగదీశ్వర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్

సన్నాహక సమావేశం



భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్, కూకట్‌పల్లి, కొండాపూర్ డివిజన్‌లలో చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం ఆదివారం బీజేపీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ... చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలన్నారు. 45 రోజులు పార్టీకి సమయాన్ని కేటాయించి ఎవరి బూత్‌లో వారు క్రమశిక్షణతో పనిచేస్తే తప్పకుండా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి మెజార్టీ ఓట్లు బీజేపీకి వేసేలా ప్రచారం చేయాలని కోరారు. ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే పార్టీని గెలిపిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, నరేష్, రామరాజు, మణిభూషణ్, నరేందర్‌రెడ్డి, ప్రభాకర్ యాదవ్, నాయకులు నవీన్‌గౌడ్, కమలాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ఆంజనేయులు సాగర్, నరసింహచారి, విజిత్, స్రవంతి, గోపాలరావు, శ్రీహరియాదవ్, సునీల్ రెడ్డి, నాగరాజు, సీతారామరాజు, బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జర్నలిస్టుల సదస్సు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 2న జర్నలిస్టుల సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ప్రజాస్వామ్యంలో 'ఎన్నికలు – ఓటు హక్కు'అనే అంశంపై వక్తలు ప్రసంగిస్తారని తెలిపారు. ఈసీఐఎల్ ఏఎస్‌రావునగర్‌లో డాక్టర్ హోమీ జే.బాబా కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, ఎన్నికల నిఘా వేదిక తెలుగు రాష్ట్రాల కన్వీనర్ డాక్టర్ వీవీరావు, ఉప్పల్ శాసన సభ్యులు లక్ష్మారెడ్డి, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరహత్ ఆలీ, కోశాధికారి మహిపాల్‌రెడ్డిలు హాజరవుతారని తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జర్నలిస్టులు వచ్చి విజయవంతం చేయాలని బాలరాజు కోరారు.

సీఎంకు ఇఫ్తార్ ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చున్నూ పాషా

మూసాపేట: మూసాపేట డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చున్నూ పాషా ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తాను నిర్వహించే ఇఫ్తార్ విందుకు ఆహ్వానించానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ అభివృద్ధి పథంలో నడుస్తోందని ఆయన అన్నారు. ఆయన అడుగు జాడల్లో రాష్ట్ర అభివృద్ధికి, పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టింకు, అహ్మద్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా

మోతీనగర్: ఆర్యవైశ్యులు సేవా భావంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎక్కువగా చేపడతారని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా పేర్కొన్నారు. అల్లాపూర్ డివిజన్ ఆర్‌కే సొసైటీలోని శ్రీవాసవీ మాతా దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీచక్ర మేరు ధ్వజస్తంభ, యంత్ర ప్రతిష్ఠ సైత మహా కుంబాభిషేకంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ నగర అధ్యక్షుడు ఊటుకూరు శ్రీనివాస్‌గుప్తా, ఆలయ కమిటీ సభ్యులు ఆకుతోట విఠల్‌గుప్తా, సుధాకర్‌గుప్తా, గౌరీశంకర్‌గుప్తా, సురేష్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, శంకరయ్యగుప్తా, లక్ష్మీనారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

'కడియం శ్రీహరిని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని టీఎంపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు గారె వెంకటేష్‌మాదిగ విమర్శించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవినీతి, మచ్చలేని నాయకుడిగా ఎదిగిన కడియం శ్రీహరిని విమర్శించడాన్ని సహించబోమన్నారు. కడియం శ్రీహరి ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, భూకబ్జాలు చేయలేదని, ఎవరి ఆస్తులూ దోచుకోలేదని అన్నారు.

గొందళి సమాజ్‌కు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

ఆల్విన్‌కాలనీ: గొందళి సమాజ్ సంఘం అభ్యున్నతికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి ఆదివారం గొందళి సమాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏక్‌నాథ్ దనిగే వినతిపత్రం అందజేశారు. సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఏక్‌నాథ్ దనిగే మాట్లాడుతూ.. గొందళి సమాజ్ సంఘం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. ప్రత్యేక కార్పొరేషన్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తన వినతిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు వెంకట్‌యాదవ్, బస్సు రాము తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏక్‌నాథ్

ఎన్నికల అక్రమాలపై 'సీ-విజిల్'

- ఫిర్యాదు చేయాలన్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్
- సీ-విజిల్ ద్వారా ఇప్పటి వరకు 13 కేసులు నమోదు.. పరిష్కారం



సాక్షి,మేడ్చల్ జిల్లా: బాధ్యతగల పౌరులుగా ఎన్నికలలో అక్రమాలు, ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలనుకుంటే సీ- విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికల నియమావళికి భిన్నంగా ఉన్న దేనిపైన అయినా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఎవరైనా డబ్బు పంపకాలు, ఉచితాలు, ఓటర్లను ప్రలోభ పెట్టిన, మద్యం సరఫరా చేసినా, నేరపూరిత చర్యలతో భయభ్రాంతులకు గురిచేసినా, లెక్కకు మించిన ఖర్చు చేసినా, మతపరమైన ప్రసంగాలు చేసినా... తాజా ఫొటోలతోసహా వీడియోలు, ఆడియో రికార్డ్‌లతో సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎక్కడైతే ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగిందో దానికి సంబంధించిన ఫొటో లేదా వీడియో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 100 నిమిషాలలోపే ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేసిన ఫిర్యాదుపై ఐదు నిమిషాలలోపే జిల్లా ఎన్నికల అధికారి నియంత్రణలో ఉండే మానిటరింగ్ సెల్‌కు తెలుస్తుందని, తదుపరి ఐదు నిమిషాల లోపు క్షేత్ర పరిశీలన అధికారి అయిన ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలను విచారణ నిమిత్తం పంపిస్తారన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ 15 నిమిషాల్లో ఫిర్యాదులో తెలిపిన స్థలానికి చేరుకొని క్షేత్ర విచారణ చేసి, 30 నిమిషాలలో వివరాలు సేకరించి, తమ నివేదికను సంబంధిత రిటర్నింగ్ అధికారికి నివేదిస్తారని పేర్కొన్నారు. దానిపై రిటర్నింగ్ అధికారి 50 నిమిషాల్లో నివేదికను పరిశీలించి ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో కూడా 24 గంటలు సీ- విజిల్ యాప్ ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఫిర్యాదు చేసినవారి పేర్లు, సెల్ నంబర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. సీ-విజిల్‌లో ఫిర్యాదు చేసే వ్యక్తులు పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేయాలని, తీరా ఆ ప్రదేశానికి చేరుకునే లోపు ఆధారాలు లేకుండా ఉండటం వల్ల సమయం వృధా అవుతుందన్నారు. గతంలో ఇలాంటి పొరపాట్లు గమనించినట్లు గౌతమ్ తెలిపారు. పక్కా రుజువులు ,ఆధారాలు ఉన్నప్పుడే సీ-విజిల్‌కు ఫిర్యాదులు చేయాలని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా సీ- విజిల్ యాప్ ద్వారా 13 కేసులను పరిష్కరించినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు.

ఈస్టర్.. ప్రేయర్



సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చిలో నిర్వహించిన ఈస్టర్ పండుగ కార్యక్రమంలో పాల్గొన్న పాస్టర్ ఎడ్వర్డ్, సంఘు సభ్యులు

మూసాపేట: మూసాపేట, జనతానగర్‌లో నిర్వహించిన ఈస్టర్ వేడుకల్లో మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జిల్లా గోపాల్, రవిసింగ్, ఆశీర్వాదం, వెంకటస్వామి, అరుణ్, రమేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చిలో..

ఆల్విన్‌కాలనీ: ఆస్‌బెస్టాస్‌కాలనీలోని సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చిలో ఆదివారం నిర్వహించిన ఈస్టర్ పండుగ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఎడ్వర్డ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంజీవరావు, రాజేందర్, సంఘ నాయకులు డేవిడ్ రాజు, జగదీష్ బాబు, సోసెఫ్, శరత్, స్టీఫెన్, ప్రేమ్, రాజు, నిఖిల్, రాజ్‌కుమార్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



జనతానగర్‌లో జరిగిన ఈస్టర్ వేడుకల్లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్



చర్చ్‌లో జరిగిన వేడుకల్లో ఓ కుటుంబం

మత్స్యకారులకు భరోసా..!

చేపలవేటలో ప్రమాదవశాత్తు మరణిస్తే ..

వారి కుటుంబాలకు పీఎం మత్స్య బీమా యోజన కింద ఆర్థిక సాయం

- మత్స్యసంఘాల సభ్యులకు మాత్రమే పథకం వర్తింపు
- మరణించిన 90 రోజుల్లో దరఖాస్తు చేసుకుంటే రూ.5 లక్షల బీమా

సాక్షి,మేడ్చల్ జిల్లా: మత్స్యకారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రమాద బీమా పథకం వారి కుటుంబాలకు భరోసానిస్తోంది. కులవృత్తి అయిన చేపలవేటలో ప్రమాదవశాత్తూ నీటమునిగి, రోడ్డు ప్రమాదం, విద్యుదాఘాతం తదితర కారణాలతో మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ప్రధానమంత్రి మత్స్య బీమా యోజన పథకంలో ఆర్థిక సాయం అందజేస్తారు. సామూహికంగా లబ్ధి చేకూర్చేందుకు ప్రవేశపెట్టిన ఈ పథకం పలు మత్స్యకారుల కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోంది.

మత్స్య పారిశ్రామిక సంఘాల సభ్యులకు వర్తింపు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 80 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, ఇందులో 3,474 మంది సభ్యులు ఉన్నారు. 13 మహిళా మత్స్య పారిశ్రామిక సంఘాలు, 3 ఫిషర్‌మెన్ మార్కెంటింగ్ కోఆపరేటివ్ సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల సభ్యులందరికీ బీమా పథకం వర్తిస్తోంది. ఈ పథకంలో సభ్యులందరి తరఫున ప్రభుత్వాలే ఏటా ప్రీమియం సొమ్ము చెల్లిస్తాయి. సంఘాల్లో నూతనంగా సభ్యత్వం తీసుకున్న సభ్యులు కూడా సామూహిక ప్రమాదబీమా పథకం సైట్‌లో పేర్లను నమోదు చేసుకుంటే జిల్లా మత్స్యశాఖ అధికారులు పరిశీలించి అర్హులను పథకంలో చేర్చేలా చర్యలు తీసుకుంటారు.

పరిహారం పొందాలంటే..

ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు బీమా పరిహారం అందాలంటే బాధిత కుటుంబసభ్యులు సకాలంలో జిల్లా మత్స్యశాఖ అధికారులకు దరఖాస్తు అందజేయాల్సి ఉంటోంది. మృతి చెందిన 90 రోజుల్లోగా జిల్లా కార్యాలయానికి సమాచారం అందించాలి. వారిచ్చే దరఖాస్తుపత్రంలో వివరాలు పొందుపర్చి మరో రెండు నెలల్లో పోలీస్ ఎఫ్ఐఆర్, పంచనామా, మరణ ధ్రువీకరణ, వారసత్వ ధ్రువీకరణ, పోస్టుమార్టం పత్రాలను జిల్లా మత్స్యశాఖ అధికారికి అందజేస్తే వారు ఉన్నతాధికారులకు నివేదిస్తారు. సభ్యుల నామినీకి రూ.5లక్షల బీమా సొమ్ము అందజేస్తారు. ఈ వ్యవహారంలో పైరవీలు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా నామినీ బ్యాంకు ఖాతాలో పరిహారాన్ని జమ చేస్తారు. బీమా మంజూరైన బాధితుల పేర్లతో కూడిన జాబితాను జిల్లా కార్యాలయానికి పంపిస్తారు. ఈ పథకంలో జిల్లావ్యాప్తంగా పలు మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థికసాయం అందుతోంది.

నిరంతరంగా సభ్యుల నమోదు ప్రక్రియ

మత్స్య పారిశ్రామిక సంఘాల్లోని సభ్యులందరికీ బీమా సౌకర్యం ఉంటుంది. నూతన సభ్యుల నమోదు ప్రక్రియ నిరంతరం జరుగుతోంది. కొత్తగా చేరే సభ్యులకు చేపలు పట్టే నైపుణ్యంలో పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తాం. చేపలు పట్టడం, వల విసరడం, వల అల్లడం తదితర పనులు వచ్చినవారికే సభ్యత్వం ఇస్తాం. – పూర్ణిమా, జిల్లా మత్స్యశాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



మోతీనగర్: వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి దోహదపడతాయని శ్రీసాయి చైతన్య టెక్నో హైస్కూల్ కరస్పాండెంట్ ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. రెండు రోజుల నుంచి అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్‌లోని పాఠశాలలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శన ఆదివారం ముగిసింది. ఈ ప్రదర్శనలో విద్యార్థులు సుమారు 300 రకాల నమూనాలను ప్రదర్శించి ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభినందనలు



రంజిత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకురాలు శిరీష

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్న రంజిత్‌రెడ్డిని స్థానిక కాంగ్రెస్ మహిళా నాయకురాలు శిరీష సత్తూర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం రంజిత్‌రెడ్డి సతీమణి, టీటీడీ మెంబర్ సీతారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ్, మధు, సౌజన్య, గాయత్రి, రమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి ఓయూలో సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలను ఏప్రిల్ 3, 4 తేదీల్లో నిర్వహించనున్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో రెండ్రోజుల పాటు జరిగే సాంస్కృతిక పోటీల్లో క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీల విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతిఏటా సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

అబోడ్ బయోటెక్‌తో ఓయూ ఒప్పందం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అబోడ్ బయోటెక్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అబోడ్ బయోటెక్ ప్రతినిధులు ఎం.శ్రీనాథ్, షాలిని ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. సంయుక్త పరిశోధనలు, అధ్యాపకుల మార్పిడి, విద్యార్థులకు ఇంటెర్న్‌షిప్ ఇతర అంశాలపై సహకారం కోసం సంతకాలు చేశారు.

విదేశీ విద్యార్థుల ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో విదేశాల విద్యార్థుల ప్రవేశాలకు ప్రకటన విడుదల చేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీతో పాటు ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు అధికారులు ప్రకటన జారీ చేశారు. పూర్తి వివరాలకు osmania.ac.inను చూడొచ్చు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



మృతుడు బేరు బహదూర్

మూసాపేట: నిర్మాణంలో ఉన్న భవనంలో ఫాల్ సీలింగ్ పనులు చేస్తున్న ఓ కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుజుల గ్రామం, బలరంపూర్‌జిల్లా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎం.బేరు బహదూర్(34) అల్లాపూర్ రాజీవ్‌గాంధీనగర్‌లో స్నేహితులతో కలిసి ఉంటూ ఫాల్ సీలింగ్ పనులు చేస్తుంటాడు. ఇతని భార్యా, ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె సొంత గ్రామంలోనే ఉంటున్నారు. కైత్లాపూర్ శ్రీరామ్‌నగర్‌లో ఫాల్ సీలింగ్ పనులు చేస్తున్నాడు. అదివారం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మరణించాడని తోటి కార్మికులు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు భవన యజమాని వర్రి ప్రభాకర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి దుర్గంధం.!





అపరిశుభ్రంగా ఉన్న మూసాపేటలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి

మూసాపేట: మూసాపేటలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై చెత్తాచెదారంతో నిండిపోతోంది. కూడళ్లలో చెత్త వేయొద్దని.. చలానా వేస్తామని అధికారులు చెప్పడంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై పడేస్తున్నారు. అధికారులు ఇటు వైపు చూడకపోవటంతో చెత్తాచెదారం పేరుకుపోతోంది. అంతేకాకుండా భిక్షాటన చేసే వారు అక్కడే నిద్రిస్తుండటంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని పాదచారులు పేర్కొంటున్నారు. లిఫ్ట్ కూడా ఏర్పాటు చేయాలని వృద్ధులు కోరుతున్నారు.